క్లుప్తంగా

సామాజిక కార్యక్రమాలతోనే ఆనందం



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వెంకటేష్

ఆమదాలవలస: సామాజిక కార్యక్రమాలతోనే ఆనందం కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. పట్టణంలోని కొత్తకోటవారి వీధిలో నివాసం ఉంటున్న పేడాడ అవినాష్ పుట్టినరోజు సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెప్రర్సీ కాలనీలోని 45 మంది అనాథులు, దివ్యాంగులు, వృద్ధులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ గోవిందరావు

పాతపట్నం: భవిత కేంద్రాల్లో విభిన్న ప్రతిభావంతులకు బోధన, శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సహిత విద్య సమగ్రశిక్షా జిల్లా కో ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలనువిభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. వీరికి భవిత కేంద్రంల్లో ఉన్న సిబ్బంది సంరక్షణ కల్పిస్తున్నారన్నారు. హెచ్ఎం కృష్ణారావు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తా..

సరుబుజ్జిలి: విజయరాంపురం గ్రామ సచివాలయంలో పరిధిలో పని చేస్తున్న విద్యుత్ లైన్‌మన్ (ఎనర్జీ అసిస్టెంట్) విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విజయరాంపురం సర్పంచ్ బెండి అప్పలనాయుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో విద్యుత్ మరమ్మతులు గురించి పలుమార్లు లైన్‌మన్‌కు చెప్పినా పట్లనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. పంచాయతీలో విద్యుత్ సమస్యలు తిష్ట వేస్తున్నాయన్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌కో ఏడీలకు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని సవర మర్రిపాడు గ్రామ సమీపంలో సారా తయారీ స్థావరాలపై డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మద్యం తయారీ, క్రయ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్, పలువురు సిబ్బంది ఉన్నారు.


నగదు ప్రోత్సాహకం అందజేత



విద్యార్థిని రంజితను సత్కరిస్తున్న రామరాజు, తదితరులు

కొత్తూరు: చదువులో ప్రోత్సహించేందుకు విద్యార్థులకు నగదు పరస్కారాలను అందజేస్తున్నట్లు రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ పారిశిల్లి రామరాజు అన్నారు. మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2023–24లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన కౌమది రంజితతోపాటు పలువురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ట్రస్టు తరఫున పాఠశాల హెచ్ఎం సువ్వారి నిర్మల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థిని రంజితతోపాటు తల్లిదండ్రులను సత్కరించారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని బొత్తాడసింగి గ్రామంలో శుక్రవారం దోమల నివారణ మందును పారిశుద్ధ్య కార్మికులు పిచికారీ చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యం అవుతుందని సర్పంచ్ ఈగల భవాని అన్నారు. స్థానిక పెద్దలు ఈగల చిన్నారావు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

● అవగాహన



నానో డీఏపీ వాడకంపై సారవకోట మండలం బుడితి గ్రామంలోని రైతు మెండ మురళీకృష్ణ పొలంలో శుక్రవారం అవగాహన కల్పించారు. నానో డీఏపీని డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేసే విధానాన్ని వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు వివరించారు. ఈ ఎరువు పంటలో నత్రజని, భాస్వరం లోపాలను సరి చేస్తుందన్నారు. నానో డీఏపీని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఏఈఓ కంతయ్య, వీఏఏ దిలీప్ ఉన్నారు. - సారవకోట

● భవిత కేంద్రం తనిఖీ



సరుబుజ్జిలి భవిత కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు తెలిపారు. భవిత కేంద్రాన్ని సరుబుజ్జిలి హైస్కూల్‌లో విలీనం చేసిన అనంతరం శుక్రవారం కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సేవలు, రాయితీలు అందేలా చూడాలని ఐఈఆర్పీలకు సూచించారు. హెచ్ఎం బొత్స వెంకటరమణ, ఐఈడీఎస్ జగన్నాథం పాల్గొన్నారు. - సరుబుజ్జిలి

● డ్రమ్ సీడర్‌తో నాట్లు



డ్రమ్ సీడర్ విధానంలో విత్తనాలు వేయడంతో అధిక దిగుబడి సాధించవచ్చునని కొత్తూరు వ్యవసాయ శాఖ ఏడీఏ బొడ్డేపల్లి రాజగోపాల్‌రావు అన్నారు. బూర్జ మండలంలోని తుద్దలి గ్రామంలో శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ విధానంలో విత్తనాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. రెడ్డీస్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు, జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ రేవతి, ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. - బూర్జ

● బిజీ.. బిజీ..



గత ఐదారు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురిశారు. శుక్రవారం వాతావరణం సాధారణ స్థితికి చేరుకోవడంతో మెళియాపుట్టి మండలంలో రైతులు పొలాల్లో వరి నాట్లు వేయడం ప్రారంభించారు. జానపదాలను ఆలపిస్తూ.. నాట్లు వేసే దృశ్యం మెళియాపుట్టి మండల కేంద్రంలో కనిపించింది. కూలీల కొరత కూడా ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. అధిక మొత్తంలో కూలి ఇవ్వాలన్నా ఆర్థికపరంగా ఇబ్బంది పడుతున్నారు. - మెళియాపుట్టి

● పొలం బాట



హిరమండలం మండలంలోని సవర చొర్లంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం పొలం బాట పట్టారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంటపై హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయుడు మాధవరావు అవగాహన కల్పించారు. వరి పంట సాగుకు అవసరమయ్యే యంత్రాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. - హిరమండలం

అంగన్‌వాడీ కేంద్రాలపై .. పర్యవేక్షణ కరువు

- 17 సెక్టార్లకు ఆరుగురే ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు
- ఇన్‌చార్జి బాధ్యతలతో పెరుగుతున్న పనిభారం

హిరమండలం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతుంది. ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. కేంద్రాలను పర్యవేక్షించడంలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం. ప్రతిరోజూ తనిఖీ చేయాల్సి ఉంటుంది.

ఐదు మండలాల్లోనూ ఖాళీలు..

నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షించలేకపోతున్నారు. కేంద్రాల సంఖ్య ఆధారంగా సెక్టార్లుగా విభజించారు. ప్రతీ సెక్టర్‌కు ఒక సూపర్‌వైజర్ ఉండాలి. ఐదు మండలాల్లో 17 సెక్టర్లున్నాయి. 17 మంది సూపర్‌వైజర్లు అవసరం ఉండగా ప్రస్తుతం ఆరుగురు ఉన్నారు. ప్రతీ సూపర్‌వైజర్ నెలకు 30 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఐసీడీఎస్ సీడీపీఓలు, ఏసీడీపీఓలు కూడా 30 సెంటర్ల చొప్పున నెలకు తనిఖీ చేయాల్సి ఉంది. సూపర్‌వైజర్ల కొరతతో కొంతమందికి ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పజెప్పింది. కొన్ని మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లగా అదనపు పనులు అప్పగించారు.



సుభలయ అంగన్‌వాడీ కేంద్రం

అదనపు భారం..

ప్రస్తుతం ప్రభుత్వం ఐసీడీఎస్ సిబ్బందికి పని భారాన్ని పెంచింది. ట్రాకింగ్ కార్యక్రమాన్ని ఐసీడీఎస్‌కు అప్పగించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో బాధ్యతలను ఐసీడీఎస్ శాఖకు అప్పగించింది. ఇవన్నీ పూర్తి స్థాయిలో అమలు కావాలంటే సిబ్బంది పూర్తిగా ఉంటేనే సాధ్యమవుతుంది. ఐసీడీఎస్ శాఖలో ఖాళీగా ఉన్న సూపర్ వైజర్లు, తదితర పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సెక్టార్ల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	సెక్టార్లు	సూపర్ వైజర్లు
పాతపట్నం	105	4	1
హిరమండలం	78	3	2
ఎల్.ఎన్.పేట	61	2	0
కొత్తూరు	104	4	2
మెళియాపుట్టి	108	4	1

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం..



ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. సూపర్‌వైజర్లు చాలా తక్కువగా ఉన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం లింక్ సూపర్ వైజర్లను తీసుకుంది. ప్రస్తుతం ఖాళీల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. సూపర్‌వైజర్ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తే ఐసీడీఎస్ కార్యక్రమాలు ఇంకా బాగా అమలు చేయడానికి అవకాశం ఉంటుంది.

– యు.విమలకుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ, కొత్తూరు

రైల్వే అర్బన్ ఎన్నికల్లో 'కొల్ల' విజయం



పత్రం అందుకుంటున్న శ్రామిక్ యూనియన్ అభ్యర్థి చిరంజీవులు

పాతపట్నం: ఈస్ట్ కోస్ట్ రైల్వే అర్బన్ బ్యాంక్ డెలిగేట్ ఎలక్షన్‌లో భాగంగా నౌపడ, గుణుపూర్ పరిధిలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అభ్యర్థి (డెలిగేట్) కొల్ల చిరంజీవులు విజయం సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్‌పై రైల్వే శ్రామిక్ యూనియన్ విజయం సాధించింది. నౌపడ నుంచి గుణుపూర్ మధ్య పనిచేసిన రైల్వే ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 120 ఓట్లు గాను 82 ఓట్లు శ్రామిక్ యూనియన్‌కు, 38 ఓట్లు శ్రామిక్ కాంగ్రెస్‌కు వచ్చాయి. భారీ ఓట్లు సాధించిన కొల్ల చిరంజీవులకు శ్రీకాకుళం ఏడీఈఎన్ బి.వి.ఎస్.మూర్తి గెలుపొందినట్లు పత్రం అందజేశారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



నరసన్నపేట: ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

నరసన్నపేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక కేంద్రాల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని డీఎల్‌డీఓ పడాల వాసుదేవరావు అన్నారు. నరసన్నపేట మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన సచివాలయాల్లో సిబ్బంది పనితీరు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఆధార్ ప్రత్యేక కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఆధార్ ప్రత్యేక కేంద్రాలపై ప్రచారం చేయాలని, విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని సూచించారు. సచివాలయాల్లో వివిధ సేవల ద్వారా సేకరించిన మొత్తాన్ని ఎప్పటికప్పుడు డిజిటల్ అసిస్టెంట్లు బ్యాంకుల్లో జమ చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ రామకృష్ణ, నరసన్నపేట పంచాయతీ ఈఓ చిన్నారావు తదితరులు ఉన్నారు.

పాతపట్నం మండలంలో..

పాతపట్నం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు ప్రజలకు సూచించారు. పెద్దలోగిడి, గంగువాడ గ్రామాల్లో ఆధార్ క్యాంప్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 27వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నామన్నారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఆమరావతిలోని సచివాలయంలో సీఎంను శుక్రవారం కలిశారు. వంశధార–నాగావళి నదుల అనుసంధాన పనులు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. పొందూరు మండలంలోని రెల్లి గెడ్డ పనులను తక్షణమే పునఃప్రారంభించి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. నియోజకవర్గంలోని రహదారులతోపాటు శ్రీకాకుళం–ఆమదాలవలస రహదారి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలన్నారు. యువత ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, నియోజకవర్గంలో ఓ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

ఫ్రీజర్ వితరణ



ట్రస్టు సభ్యులకు ఫ్రీజర్‌ను అందజేస్తున్న రాజు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన శ్రీభగత్ సింగ్ చారటిబుల్ ట్రస్టుకు మండలంలోని ఓంద్రుజోలకు చెందిన సామాజికవేత్త బామిడి రాజు ఫ్రీజర్‌ను శుక్రవారం అందజేశారు. ఫీజర్‌ను అందించిన రాజును కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, ట్రస్టు సభ్యులు అభినందించారు.

తాగునీటి పథకం పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న డీఈ మధుసూదనరావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో నిర్మించిన మెగా రక్షిత తాగునీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. తాగునీరు అందించేందుకు వంశధార నదీ తీరంలో ఉన్న ఫిల్టర్ భావి కోసం ఏర్పాటు చేసిన వంతెన నడకదారి శిథిలావస్థకు చేరుకుంది. వంశధార నదికి వచ్చిన వరదనీటి ప్రవాహ వేగానికి తీరం కోతకు గురవుతుందని, నడక వంతెన కొట్టుకుపోయో ప్రమాదం ఉందన్నారు. వరదనీటి ప్రవాహ వేగాన్ని నియంత్రించేందుకు ఇసుక బస్తాలతో గట్టు నిర్మిస్తామన్నారు.

మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలి



పాతపట్నం: మాట్లాడుతున్న సీఐ నల్లి సాయి

పాతపట్నం: గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని సీఐ నల్లి సాయి అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో హలో యువత మేలుకో అంటూ అవగాహన ర్యాలీ, మానవహారం శుక్రవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేక పోలీసులను నియమించామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.యుగంధర్, కె.శ్రీనివాసరావులు మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల భారీ నుండి కాపాడాలన్నారు. ఎస్ఐ మహమ్మద్ యాసిన్, నాయకులు వెంకటరావు, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు..

ఆమదాలవలస: ఆటోల్లో గంజాయి, మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆమదాలవలస సీఐ దివాకర్ హెచ్చరించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికుల భద్రత ఆటో డ్రైవర్ల చేతిలోనే ఉంటుందన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దుతో జైలు శిక్ష తప్పదన్నారు. గంజాయి రవాణాపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం..

నరసన్నపేట: మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరం. వీటి జోలికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని నరసన్నపేట సెబ్ సీఐ సతీష్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ (బోర్డు) ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను శుక్రవారం వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందేశాత్మక నాటికల ప్రదర్శన



మెళియాపుట్టి: పొలం పనిని నాటిక ద్వారా వివరిస్తున్న విద్యార్థినులు



మెళియాపుట్టి: పాముకాటుకు గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న విద్యార్థి

మెళియాపుట్టి: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రావీణ్యం పొందాలని కరజాడ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం ఎల్.వెంకటరావు అన్నారు. 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పలు సందేశాత్మక నాటికలను శుక్రవారం ప్రదర్శింపజేశారు. రైతులు నిత్యం పంట పొలాల్లో, తోటల్లో పనులు చేసుకుంటూ ఉంటారు. ఆయా సమయాలలో పాముకాటుకు గురైతే ఎటువంటి ప్రథమ చికిత్స చేయాలి, సీపీఆర్ చేసి ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై విద్యార్థులు చేసిన నాటిక అలరించింది. ప్రస్తుత సమాజంలో మానవాళికి సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, సెల్‌ఫోన్ టవర్ల వల్ల జీవరాశులకు కలిగే భారీ ఆటుపోట్లను కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, ఆదినారాయణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని మామిడివలస గ్రామ జెడ్పీహైస్కూల్ ఎంఈఓ–1 ఎస్.శ్యామ సుందరరావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపర్చడానికి నిర్మాణాత్మక సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంటలు పరిశీలించి సూచనలు చేశారు. హెచ్ఎం ఎం.అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పీఆర్టీయూ సభ్యత్వాన్ని నమోదు పత్రాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

ఎల్.ఎన్.పేట: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కె.అమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి బి.సుధాకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. జీఓ నంబర్ 117ను, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. పీఆర్టీయూ నాయకులు పి.అప్పలనాయుడు, జి.మహేష్, ఎం.ముఖలింగం, వై.అప్పారావు నాయుడు, పి.శ్రీధర్, టి.ఉపేంద్ర, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై అవగాహన

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలను నిర్వహించటం జరుగుతుందని సామాజిక తనిఖీ ఎస్సార్పీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని దబ్బపాడు, చింతలబడవంజ, పెద్దకొల్లివలస, సుమంతాపురం పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో మాట్లాడారు. పనిచేసే కాలంలో అందుకున్న వేతనాలు, పని ప్రదేశంలో కల్పించాల్సిన సదుపాయాలు, వేతనాలు అందకపోతే తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కలిగించారు. ఆయా పంచాయతీల్లో చేపట్టిన పనులు, సామాజిక తనిఖీ బృందాలు గుర్తించి అంశాలను చదివి వినిపించారు. ఏపీఓ శ్రీదేవి, సర్పంచ్‌లు ముద్దాడ మోహిని, ఊట లక్ష్మి, రావాడ రాజేశ్వరి, పిల్లా నర్సునాయుడు, సామాజిక తనిఖీ డీఆర్పీలు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను మరువలేం

నరసన్నపేట: పాకిస్తాన్ దురాక్రమణలపై ఆపరేషన్ విజయ్ పేరుతో భారత సైన్యం చేపట్టిన కార్గిల్ యుద్ధానికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా యుద్ధంలో అమరులైన సైనికులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక చైతన్య భారతి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద పలువురు జాతీయ జెండా పట్టుకొని యుద్ధంలో అమరులైన సైనికులకు జేజేలు పలికారు. చైతన్య భారతి అధ్యక్షుడు చింతు పాపారావు, ఏఎస్ఐలు అసిరినాయుడు, తులసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. మాజీ సైనికుల ఆధ్వర్యంలో కూడా కార్గిల్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.

పుస్తకాల పంపిణీ

పాతపట్నం: పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అనాథ ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థులకు మాజీ సైనికులు పుస్తకాలు అందజేశారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను మాజీ సైనికుల అధ్యక్షుడు టి.రామారావు శుక్రవారం అందజేశారు. వైస్ చైర్మన్ ఎ.కె.రావు, జాయింట్ సెక్రటరీ సీహెచ్ త్రినాధరావు, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



పాతపట్నం: విద్యార్థులకు పుస్తకాలు సమకూర్చిన మాజీ సైనికులు



నరసన్నపేట: అమరవీరులకు నివాళులర్పిస్తున్న చైతన్య భారతి సభ్యులు, పోలీసులు